క్లుప్తంగా

సేవాగుణం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని, సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పరంధామ నిలయంలో 150 మంది అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ. 100 చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి పీఠం ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, ఉపాధ్యాయుడు శివనాగయ్య, సభ్యులు సుబ్బయ్య, రాములమ్మ, నరసింహులు పాల్గొన్నారు.

చురుగ్గా వైకుంఠ ఏకాదశి పనులు



ఆలయం వద్ద చదును చేస్తున్న జేసీబీ

బనగానపల్లె రూరల్: స్థానిక కొండపేట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 10వ తేదీ వైకుంఠ ఏకాదశి నిర్వహించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ఆదివారం పరిశీలించారు. ఆమె వెంట ఆర్యవైశ్య సంఘం నాయకులు టంగుటూరి శీనయ్య, గాలి మద్దిలేటిరెడ్డి, జంగంశెట్టి తదితరులు ఉన్నారు.

తీరిన ఆట స్థలం సమస్య



మోడల్ స్కూల్ ఆవరణలో చదును చేస్తున్న జేసీబీ

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్ 2016లో ప్రారంభమైనా విద్యార్థులు ఆడుకునేందుకు సరైన ఆట స్థలం లేక ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల తోడ్పాటుతో పీఎం శ్రీనిధుని ఉపయోగించి ఆట స్థలం సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. జేసీబీతో మట్టిని తోలి చదును చేస్తున్నారు. విద్యార్థులు కోకో, షటిల్, వాలీబాల్, క్రికెట్ ఆడుకునేందుకు అనువుగా తయారు చేస్తున్నట్లు ఎంఈఓ సోమశేఖర్, ప్రిన్సిపాల్ మరియదాసు తెలిపారు.

రాధాక్రిష్ణకు నివాళి



నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

డోన్: బ్రాహ్మణ సంఘం వ్యవస్థాపకుడు రాధాక్రిష్ణ వర్ధంతి సందర్భంగా ఆదివారం వేద మాత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక గాయత్రీ పీఠం ఆవరణలో సంఘం అధ్యక్షుడు, కళారత్న, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అధ్యక్షతన సభ జరిగింది. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కళ్లె శేషావలిశర్మ, భాస్కరశర్మ, కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు గంగాధర శాస్త్రి, రాజేశ్వరరావ్, సత్యనారాయణ, చంద్రశేఖర శర్మ, బాలసుబ్బయ్య, పోస్టల్ రామారావు, సురేంద్ర, రవిభట్, లక్ష్మీనారాయణ, గోపాల్, కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



లక్ష్మీశాంతి

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటకు చెందిన ఆకాంక్ష పౌండేషన్ విద్యార్థి లక్ష్మీ శాంతి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ సంస్థ కార్యదర్శి రాజేష్ తెలిపారు. ఆదివారం తణుకులో 59వ ఆంధ్ర ప్రదేశ్ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. అండర్–16 విభాగంలో లక్ష్మీశాంతి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఈనెల 12న ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థినితో పాటు కోచ్ విజయ్‌కుమార్‌ను పౌండేషన్ వ్యవస్థాపకుడు సాయి వంశీవర్ధన్ అభినందించారు.

రేపు విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

బనగానపల్లె రూరల్: ఈ ఆర్థిక సంవత్సరం (2025–26)కు సంబంధించి డిస్కంలో ప్రతిపాదించిన వార్షిక ఆదాయం, అవసరాలు, విద్యుత్ చార్జీలపై డోన్ డీఈఈ కార్యాలయంలో ఈ నెల 7, 8వ తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని బనగానపల్లె డీఈఈ మద్దిలేటి తెలిపారు. విజయవాడ నుంచి ఏపీఈఆర్‌సీకి చెందిన ఉన్నతాధికారులు హైబ్రిడ్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారని చెప్పారు. అలాగే 10వ తేదీ కర్నూలుకు చెందిన ఏపీఈఆర్‌సీ ఉన్నతాధికారులు నిర్వహిస్తారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ప్రారంభించేదెప్పుడు..?

- వైఎస్సార్‌సీపీ హయాంలో బహుళ ప్రయోజన గోదాముల నిర్మాణం
- ఆకుమల్ల గ్రామంలో ప్రారంభానికి నోచుకోని వైనం
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో అన్నదాతలకు ఇబ్బందులు



ఆకుమల్లలో నిర్మించిన గోదాము

సంజామల: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది ఆకుమల్లలో నిర్మించిన గోదాము పరిస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం లక్షలు వెచ్చించి బహుళ ప్రయోజ సౌకర్యాలతో గోదాములను నిర్మించింది. ఆకుమల్ల, పేరుసోముల గ్రామాల అన్నదాతలు పంటలను భద్రపరుచుకోవడానికి వీలుగా గోదాములను నిర్మించింది. నిర్మాణం పూర్తయి ఆరు నెలలు అవుతున్నా కూటమి ప్రభుత్వం ప్రారంభించలేదు. అధికారులు సైతం చొరవ తీసుకోవడం లేదు. వీటిని ప్రారంభిస్తే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు.

500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మాణం

ఆకుమల్ల గ్రామంలో రూ.45 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించారు. పేరుసోముల గ్రామంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాము నిర్మాణంలో ఉంది. ఆకుమల్ల గ్రామంలో గోదాము నిర్మాణం పూర్తయి ప్రాథమిక సహకార సంఘానికి అప్పగించారు. పేరుసోముల గ్రామంలో ఎన్నికల ముందు పనులు జరిగాయి. ఎన్నికల కోడ్ రావడం..కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గోదాము నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రైతులు పండించిన పంటను నిల్వ చేసుకోవడానికి అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీకి ఎక్కడ మంచి పేరు వస్తుందనే కుటిల రాజకీయంతోనే జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నష్టపోతున్నాం



ఇటు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక మరోవైపు ఇంటిలో ఉంచుకుంటామంటే స్థలం లేక నష్టానికే ధ్యాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గోదాములు లేక ఇబ్బందులు పడుతున్నాం. అదే గోదాము ఉంటే వాటిలో భద్రపరుచుకుని గిట్టుబాటు ధర ఉన్నప్పుడు విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది.
–మౌలిశ్వర్‌రెడ్డి, రైతు, ఆకుమల్ల

గోదాములను ప్రారంభించాలి



రైతుల సౌకర్యార్థం నిర్మించిన బహుళ ప్రయోజన గోదాములను త్వరగా ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తేవాలి. ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటను భద్రపరుచుకోవాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం గోదాములపై దృష్టి పెట్టకపోవడం చాలా బాధాకరం. రైతుల సమస్యలపై ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.
–నాగేశ్వర్‌రెడ్డి, ప్రాథమిక సహకార సంఘం మాజీ చైర్మన్, ఆకుమల్ల

ప్రభుత్వం నుంచి సమాచారం లేదు

ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే గోదాములను రైతులకు అందుబాటులోకి తెస్తాం. అయితే ఇప్పటి వరకు సమాచారం లేదు. రూ.45 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వీటిని నిర్మించారు. మైనర్ పనులు ఉన్నాయి. పూర్తి అవ్వగానే అధికారుల ఆదేశాల మేరకు ప్రారంభిస్తాం.
–చంద్రశేఖర్‌రెడ్డి, సీఈఓ, ఆకుమల్ల సహకార సంఘం

పందుల స్వైర విహారం

స్థానిక అయ్యప్పస్వామి గుడి సమీపంలోని మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల బీసీ గురుకుల పాఠశాల, కళాశాల ఎదుట పందులు స్వైర విహారం చేస్తున్నాయి. కొందరు పాఠశాల ప్రహరీ సమీపంలో పేడ, గడ్డి, చెత్త, చెదారాన్ని పడేస్తుండడంతో ఆహారం కోసం పందులు అక్కడే సంచరిస్తున్నాయి. చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. విద్యార్థులు, అధ్యాపకులు కంపు భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పాఠశాల వద్ద చెత్త పడేయకుండా చూడాలని.. ఉన్న చెత్తను తొలగించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. –డోన్



పాఠశాల ఎదుట సంచరిస్తున్న పందులు

కార్మికుల ఆశాజ్యోతి సూర్యనారాయణ



నివాళులర్పిస్తున్న సీఐటీయూ కార్మికులు



డోన్ టౌన్: పాణ్యం సిమెంట్స్ కార్మిక నాయకుడు కామ్రేడ్ సూర్యనారాయణ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శివరామ్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు. 37వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాణ్యం సిమెంట్స్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. ఓర్వలేని కొందరు ఆయన్ను హత్య చేయించారని తెలిపారు. సీపీఎం నాయకులు కొండన్న, మండల కార్యదర్శి కొయిలకొండ నాగరాజు, కోశాధికారి నాగమద్దయ్య, నాయకులు సుబ్బారెడ్డి, మహానంది, గోపాల్, హుస్సేన్‌పీరా, తిరుపాలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కార్మిక నాయకుడు సూర్యనారాయణ కార్మికుల కోసం చేసిన పోరాటాలు మరువలేనివని సీపీఎం నాయకులు ఎల్లయ్య, రహంతుల్లా, మధుశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, రెడ్డిపల్లె, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా అన్నకూటోత్సవం





అన్నకూటోత్సవ పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు, వివిధ పుష్పాలతో స్వామివారి చిత్రం

డోన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం అన్నకూటోత్సవ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ ఆధ్వర్యంలో వేకువజామున గోదాదేవి, శ్రీదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో ఏర్పాటు చేసిన స్వామివారి చిత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీకుమారి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.

ప్రభుత్వాస్పత్రిలో రొట్టెల పంపిణీ

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం రోగులు, గర్భిణులు, బాలింతలు, సహాయకులకు రొట్టెలు, గుడ్డు, పప్పు పంపిణీ చేశారు. డోన్‌కు చెందిన చిదంబరం ఆర్థిక సహాయంతో ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ వీటిని అందజేశారు.

ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత విజయ్‌కుమార్

డోన్ టౌన్: కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నా ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాబు, మధు, కార్తీక్, రవి, హర్ష తదితరులు ఉన్నారు.

ఊరిపై అభిమానం

కొలిమిగుండ్ల: రోడ్డు పక్కన ఆర్అండ్‌బీ అధికారులు ఊరి పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు చుట్టూ కంపచెట్లు అల్లుకుపోయాయి. బోర్డుకు సమీపంలోని చెట్టు కింద చింతలాయిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన యువకులు విరామ సమయంలో సేదతీరుతుంటారు. ఆదివారం అనుకోకుండా యువకుల్లో ఆలోచన మెదిలింది. తమ ఊరి పేరున ఏర్పాటు చేసిన బోర్డు కనిపించడం లేదనే ఉద్దేశంతో అప్పటికప్పుడు గొడ్డలి తీసుకొచ్చి చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించి శుభ్రం చేసి ఊరిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.



బోర్డు వద్ద కంపచెట్లు తొలగిస్తున్న యువకులు



కోవెలకుంట్ల: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్లలో కార్డన్‌సెర్చ్

- రికార్డులు లేని 34 వాహనాలు సీజ్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఎలాంటి మారణాయుధాలు లభ్యం కాలేదు. రికార్డులు లేని 30 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను సీజ్ చేశారు. అనంతరం కాలనీవాసులను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ.. కాలనీలో ఎక్కువశాతం కుటుంబాలు బాడుగకు ఉంటున్నాయని, ఓనర్లు ఇల్లు అద్దెకిచ్చే సమయంలో అన్ని వివరాలు తెలుసుకుని బాడుగకు ఇవ్వాలని సూచించారు. కాలనీలో మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా బైక్‌లు నడిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కోవెలకుంట్ల, సంజామల ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, రమణయ్య ఉన్నారు.



బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

సత్ప్రవర్తనతో మెలగాలి

బేతంచెర్ల: రౌడీ షీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ శాంతియుత జీవనం గడపాలని సీఐ డి. వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారి వెంట వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు, అధిక లోడ్లు, లైసెన్స్ లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ప్రమాదాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. ఎస్ఐ రమేష్‌బాబు ఉన్నారు.

స్వర్ణ కాంతి



బేతంచెర్లలో బంగారు వర్ణంలో సూర్య కిరణాలు

కొద్ది రోజులుగా చలి వణికిస్తోంది. పొంగ మంచు దట్టంగా కప్పేస్తోంది. ఆకాశాన్ని కమ్మేసిన మంచు తెరలను చీల్చుకుంటూ సూర్యుడు వెలుగును ప్రసాదించేలా కనిపిస్తున్న ఈ చిత్రం ఆదివారం ఉదయం బేతంచెర్లలో ఆవిష్కృతమైంది. ఓ వైపు సూర్యుడి స్వర్ణ కాంతులు మరోవైపు తెల్లటి మంచు పొగలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. –బేతంచెర్ల



కమ్మేసిన పొగ మంచు

సత్కారం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు


డోన్ టౌన్: సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాలకు, బాలికల ఉన్నత పాఠశాలలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి సహకరించిన దాతలను వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు ఆదివారం సత్కరించారు. అనంతరం వినియోగదారుల రక్షణ చట్టాలపై ముద్రించిన వాల్‌పోస్టర్లు, మేలుకొలుపు పుస్తకాలను ఆవిష్కరించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ మద్దమ్మ, వివిధ ప్రజాసంఘాల నాయకులు హుసేనప్ప, భూమా నాగన్న, మోహన్, రవికుమార్, జయ మనోజ్‌కుమార్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

డోన్ రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జులేఖ డిమాండ్ చేశారు. పట్టణంలోని నక్కి రామన్న భవనంలో ఆదివారం ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తక్కువ వేతనానికి ఎక్కువ పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించి కనీస వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈనెల 7న కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకురాలు



బ్రిడ్జిపై ఇరుక్కుపోయిన లారీని పక్కకు తీస్తున్న జేసీబీలు



నిలిచిపోయిన భారీ వాహనాలు

ట్రాఫిక్‌కు అంతరాయం

కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో లారీ ఇరుక్కుపోయింది. హైదరాబాద్ నుంచి రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి మట్టిలోడుతో వస్తున్న లారీ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే అదుపుతప్పింది. లారీ సగ భాగం బ్రిడ్జిలో నుంచి కిందకు దూసుకెళ్లింది. బైక్‌లు మినహా ఇతర వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా పోయింది. నెల్లూరు–ముంబై ప్రధాన రహదారి కావడంతో తెల్లవారుజాము నుంచే భారీగా వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను తిమ్మనాయినపేట క్రాస్ రోడ్డు నుంచి పంపేలా చర్యలు తీసుకున్నారు. లారీలో ఉన్న మట్టిని జేసీబీ సాయంతో మరో లారీలోకి మార్చారు. బ్రిడ్జిలో ఇరుక్కుపోయిన లారీని జేసీబీల సాయంతో బయటకు లాగారు. ఐదు గంటల తర్వాత ట్రాఫిక్ క్లియర్ అయింది. నిత్యం వందలాది వాహనాలు రవాణ సాగించే ఈమార్గంలో బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరుకుగా ప్రమాదకరంగా మారింది.

కోలుకోలేక యువకుడి మృతి



మల్లికార్జున (ఫైల్)

ఆళ్లగడ్డ: ఆర్థిక ఇబ్బందులతో నెల రోజుల క్రితం ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం కోలుకోలేక ఆదివారం మృతి చెందిన ఘటన మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మల్లికార్జున (25) 28 రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు కర్నూలుకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కాగా.. వ్యవసాయంలో నష్టాలు రావడం, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో మనస్థాపానికి గురై బలవన్మరణానికి కారణమని బంధువులు పేర్కొన్నారు. మృతుడికి గతేడాదే వివాహం కాగా ప్రస్తుతం భార్య గర్భిణి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.